క్లుప్తంగా

లలితాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీలలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున లలితాదేవి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, సుగంధ, పూజా ద్రవ్యాలతో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలితా సహస్రనామపారాయణం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వాసవి మాతకు విశేష పూజలు



వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బద్వేలు అర్బన్ : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా స్థానిక అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్య వైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఆలయ శాశ్వత ఉభయదారులతో వాసవి అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షుడు కొండపల్లి చిన్నసుబ్బారావు పాల్గొన్నారు.

రెస్టారెంట్ ప్రారంభం



పూజలు చేస్తున్న చదిపిరాళ్ల గోవర్ధన్‌రెడ్డి, చదిపిరాళ్ల వీర రఘువర్ధన్‌రెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక హోమస్ పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన దేవీపట్నం ప్యూర్ వెజిటేరియన్ ఉడిపి రెస్టారెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు చదిపిరాళ్ల గోవర్ధన్‌రెడ్డి, చదిపిరాళ్ల వీరరఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ తమకు ఆల్ ఇండియా పరిధిలో 40 బ్రాంచ్‌లు ఉన్నాయని తెలిపారు. ఎప్పటి నుంచో ప్రొద్దుటూరులో ఈ తరహా రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయాలని భావించామని పేర్కొన్నారు. ఉడిపి స్టైల్‌లో కర్ణాటక, రాయలసీమ రుచులను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. కూర్గు నుంచి తెప్పించిన కాఫీ గింజలతో ఫిల్టర్ కాఫీ అందించడం మా ప్రత్యేకత అన్నారు.

సాగునీటికి కాలువ ఏర్పాటు



సాగునీటి కాల్వ

చాపాడు : మండలంలోని సోమాపురంలో ఇరు వర్గాల నడుమ ఏర్పడిన సాగు నీటి కాలువ సమస్యకు శుక్రవారం పరిష్కారం లభించింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో పంట కాల్వ కోసం సోమాపురం సమీపంలోని 28-4బీ2లో ఏర్పడిన సమస్యను తహసీల్దారు రమాకుమారి పరిష్కరించారు. తమ సిబ్బందితో బాధిత రైతుల పొలాల్లో కొలతలు వేయించి, పోలీసుల సమక్షంలో పంటలు సాగు చేసుకునేందుకు కాల్వ ఏర్పాటుచేయించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

పని ఒత్తిడి తగ్గించాలి

కలసపాడు : టీచర్లు పాఠాలు చెప్పాలా.. బోధనేతర పనులు చేయాలా అని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రశ్నించారు. మండలంలోని పెండ్లిమర్రి గ్రామం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో శుక్రవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మూల్యాంకన పుస్తకం పేరుతో మరో గుదిబండను ఉపాధ్యాయుల మెడకు చుట్టడంతో పిల్లలకు పాఠాలు చెప్పలేక, మూల్యాంకన పుస్తకాలు రాయలేక, పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని ఒత్తిడి తగ్గించాలని ఆయన కోరారు.

ఆ గ్రామాలకు వరం.. భూగర్భ జలం.!

- పరివాహక గ్రామాల్లో సంవృద్ధిగా బోర్లలో సాగునీరు
- ఈ ఏడాది రెండోసారి సాగుపై రైతుల ఆసక్తి

ఏటా ఖరీఫ్ సీజన్ మొదలైందంటే చాలు రైతులు సాగునీటి కోసం ఎదురుచూడటం ఆనవాయితీ. అయితే ఆ గ్రామాలలో మాత్రం ఖరీఫ్ సీజన్‌కు ముందే నారుమళ్లను సిద్ధం చేస్తారు. సాగునీరు పుష్కలంగా ఉండడమే ఇందుకు కారణం. ప్రొద్దుటూరు, చాపాడు మండలాలలోని ఆరు గ్రామాల పరిధిలోని భూముల్లో జలం సంవృద్ధిగా బయటికి వస్తోంది. దీంతో ఈ ఏడాది సాధారణం కంటే ముందుగానే వరి సాగు ఆరంభించారు.

చాపాడు : చాపాడు మండలంలోని తిమ్మాయపల్లె, అయ్యవారిపల్లె, రామదాసుపురం, ప్రొద్దుటూరు మండలంలోని సీతంపల్లె, ఎర్రగుంట్లపల్లె, సగిలిగుడ్డపల్లె గ్రామాల పరిధిలోని బోర్లలో భూగర్భ జలం పుష్కలంగా లభిస్తోంది. 2004కు ముందు మూడేళ్లపాటు కరవు నెలకొన్న పరిస్థితుల్లో బోర్లలో నీరులేక ఈ గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. 2004 తర్వాత వర్షాలు కురవడంతో బోర్లలో పుష్కలంగా నీరు చేరింది.

ప్రతి రైతు పొలంలో 35 అడుగుల నుంచి లోతుకు పోయే కొద్దీ జలం అందుతూనే ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో తమ పొలాల్లో ఏటా రెండు కార్లలో పంటలు సాగు చేసుకుంటున్నారు. ఈ గ్రామాల పరిధిలో ఏటా 3వేల ఎకరాలకు పైగా వరి సాగవుతోంది.

పంట కాలంలో తుఫాను భయం..

ప్రొద్దుటూరు, చాపాడు మండలాల కలిసే ఆ ఆరు గ్రామాల్లో ఏటా జూన్‌లో నారుమళ్లను సిద్ధం చేస్తారు. జూలై ఆరంభం నుంచి వరినాట్లు వేస్తారు. మిగిలిన ప్రాంతాల్లోని రైతులు కేసీ కెనాల్, చాపాడు కాలువలకు నీరు విడుదలైన తర్వాత నారుమళ్లను సాగు చేసుకోవడం ఆగష్టు, సెప్టంబర్ మాసాల్లో వరి సాగు చేసుకోవటం జరుగుతోంది. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే సాగుకు సన్నద్ధమవుతున్నారు. పంటలు సాగు చేసుకుని పండించేంత వరకూ ఒక ఎత్తయితే పంట నూర్పిళ్ల దశలో నవంబర్ మాసంలో కురిసే తుఫాను వర్షంతో ఇక్కడి పంటలకు కాస్త ప్రతికూల పరిస్థితులు తలెత్తుతాయి. తొలి పంట పూర్తవగానే రెండో కారు వరి సాగు కోసం నారుమళ్లను సిద్ధం చేసుకుని మళ్లీ డిసెంబర్, జనవరి మాసాల్లో వరి సాగు చేయడం ఇక్కడి రైతులకు ఆనవాయితీగా వస్తోంది.



ఎర్రగుంట్లపల్లె సమీపంలో బోర్ల ఆధారంగా సాగైన వరి పైరు

ఏటా 4 ఎకరాల్లో వరి సాగు



ఏటా నాలుగు ఎకరాల్లో రెండు కార్లలో వరి పంట పండిస్తాం. వ్యవసాయం ఆధారంగా మా కుటుంబాలను పోషించుకుంటున్నాం. వ్యవసాయంతో వచ్చే ఆదాయంతోనే పిల్లలను చదివించుకున్నాం. కేసీ కెనాల్ సాగునీటి మీద ఆధారపడకుండా బోర్ల నీటితో పంటలు పండించుకుంటాం. పంట కాలం మధ్య వర్షాలు వస్తే చాలు పంటలు బాగా పండుతాయి.

– కొనిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రైతు, సగిలిగుడ్డుపల్లె, ప్రొద్దుటూరు మండలం

15 ఎకరాలకు కౌలుకు తీసుకుని వరిసాగు



ఏటా 15 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నా. మా ప్రాంతంలోని పొలాల్లో భూగర్భ జలం బాగుంటుంది. దీని ఆధారంగా కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చాపాడు కాలువ క్రింద వచ్చే సాగునీటిని పంట మధ్యలో వాడుకుంటాం.

– నాయబ్ రసూల్, కౌలు రైతు, తిమ్మాయపల్లె, చాపాడు మండలం

బోర్లలో నీరు పుష్కలం



మండలంలోని చాలా గ్రామాల్లో బోర్లలో పెద్దగా సాగునీరు లభించదు. మా గ్రామంలో బోర్లలో నీరు పుష్కలంగా ఉంటుంది. వర్షాలు కురవకపోతే బోర్లలో నీటి శాతం కొంత తగ్గుతుంది. సీజన్‌లో వర్షాలు పడితే చాలు ఏడాది పొడవునా నీరు లభిసుతంది. మా ప్రాంతంలోని వ్యవసాయం చేసుకునే రైతులకు బోర్లలో నీరు లభించడం మా అదృష్టం.

– పి. లక్ష్మిరెడ్డి, రైతు, అయ్యవారిపల్లె, చాపాడు మండలం

నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదం



ఎంపికైన విద్యార్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : జాబ్‌మేళా ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలుపడుతుందని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల పరిపాలనాధికారి ఆర్.వెంకటసాయికృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒకవైపు చదువుకుంటూనే ఉద్యోగాలు సాధించేందుకు ఇటువంటి జాబ్‌మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అపోలో, డాక్టర్ రెడ్డీస్ గ్రో ఇవి, హెట్రో డ్రగ్ లిమిటెడ్, గ్రీన్ టెక్ వంటి 16 కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్‌మేళాలో 264 మంది నిరుద్యోగ యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వారిలో 116 మందిని ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ బృందం, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన



మాట్లాడుతున్న జమిలాబీ

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జమిలాబీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం సామాజిక న్యాయ, సద్భావన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రారంభించారన్నారు. అనాథ పిల్లలు, వీధి పిల్లలు, బాల కార్మికుల రక్షణ, సంరక్షణకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించిందన్నారు. బాలల న్యాయ చట్టం, ఫోక్సో చట్టంపై అవగాన కల్పించారు. బాల్యవివాహాలు, కార్మికులు, స్కూల్ డ్రాపౌట్, చైల్డ్ అబ్యూజ్ తదితర వాటి గురించి 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం తెలపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రుద్రమూర్తి యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు,ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



పశువుకు వైద్యం చేస్తున్న పశువైద్యాధికారులు

బి.కోడూరు : మండలంలోని ఆనంవారిపల్లెలో శుక్రవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) వారి సౌజన్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కడప ఉప సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులు, గర్భ నిర్ధారణ పరీక్షలు, ఎదకు రాని పశువులను గుర్తించి చికిత్స చేశారు. కడప వీఏఎస్ డీఎల్‌డీఏ డాక్టర్ శివరాం రెడ్డి, సి.కె.దిన్నె సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డిలు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పాడిరైతులు సరైన సమయంలో ఎదను గుర్తించి సూదులు వేయించాలన్నారు. బి.మఠం సహాయ సంచాలకులు డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య పాడిపశువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. శిబిరంలో పెద్దిరాజుపల్లె, ప్రభలవీడు, బి.కోడూరు పశువైద్యాధికారులు, బి.మఠం, బి.కోడూరు పశువైద్య సహాయకులు, గోపాలమిత్రలు, పాడిరైతులు, జీవాల కాపరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా జరగాలి



అభివృద్ధి పనుల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం దేవస్థానం పరిధిలో 7.50 ఎకరాల స్థలంలో జరగాల్సిన అభివృద్ధి పనులను వేగంగా ప్రారంభించాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సూచించారు. దేవస్థానం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బస్ షెల్టర్, బ్రహ్మంగారి విగ్రహం, జాతీయ జెండా పతకం, డ్రైనేజీ నిర్మాణం తక్షణమే పూర్తిచేయాలని తెలిపారు. డీపీఆర్ సిద్ధం చేస్తే కలెక్టర్ నిధులు మంజూరుచేస్తామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో శంకర్ బాలాజీ, చెన్నుపల్లె సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి(బంక్ శ్రీను) పోలిరెడ్డి, శివయాదవ్, తదితరలు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ కార్యక్రమంపై శిక్షణ



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం ఎన్‌సీడీ 4.0 ఫేస్–2 శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్ మాట్లాడుతూ నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను ముందుగా గుర్తించి ప్రజల ప్రాణాలను కాపాడటమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. వైద్యాధికారుల ద్వారా వీఐఏ, క్లినికల్ రొమ్ము, నోటి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడం, రిఫరల్ సిస్టమ్ ద్వారా అనుమానిత కేసులను తక్షణమే పై స్థాయి ఆస్పత్రులకు పంపడం, ఎన్‌సీడీ పోర్టల్లో డేటా నమోదు చేసి ఫాలో ఆప్ బలోపేతం చేయడం గురించి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ గోపాల్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డాక్టర్ చిరంజీవిరెడ్డి, డాక్టర్ మల్లేష్, టీఓటీలు డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ మంజుల, డాక్టర్ అనూష, డాక్టర్ కవిత ప్రసన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భావితరాల కోసం మొక్కలను పెంచుదాం



మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

మైదుకూరు : భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని ప్రిన్సిపల్ నిర్మల, ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని వనిపెంట జ్యోతిరావు పులే బీసీ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమస్త జీవకోటికి ఆధార భూతమైన మొక్కలను పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చెట్లు మానవాళికి ఎంతో ఉపయోగకరమని, పర్యావరణ సమతుల్యత కోసం చెట్లు అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లి రోజు, పండగ, గృహ ప్రవేశాలు, తదితర శుభకార్యాల సందర్భాలలో విధిగా ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి అందజేసిన 100 మొక్కలను 100 మంది విద్యార్థినులు పాఠశాల ఆవరణలో నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నసీరున్నీసా బేగం, హెచ్‌ఎం నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఒరిజనల్ బిల్లులు ఇవ్వాలి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ అనిత

ప్రొద్దుటూరు రూరల్ : ఎరువుల కొనుగోలు విషయంలో వ్యాపారులు రైతులకు ఒరిజనల్ బిల్లులు ఇవ్వాలని ఏడీఏ అనిత సూచించారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న కేవీఎస్ఆర్, మహాలక్ష్మి ఎరువుల దుకాణాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగు విస్తీరణం కంటే ఎక్కువ మోతాదులో ఎరువుల దిగుమతి అయినా ఎరువుల కొరత ఉందన్నారు. ఎరువులను పక్కదాని పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోల్‌సేల్ దుకాణాలు నుండి ఏఏ మండలాలకు ఎంత యూరియా, డీఏపీ సరఫరా అయిందో రికార్డులను పరిశీలించారు. సరఫరా అయిన ప్రాంతాలకు ఎరువులు చేరాయో లేదో వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ వరహరికుమార్ పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ

అట్లూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ భరణీకృష్ణ తెలిపారు. కొండూరు సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం కొండూరు, కమలకూరు, మాడపూరు సబ్‌స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందితో ఆయన సమావేశమై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అమర్చడం జరుగుతుందన్నారు. అలాగే మిగిలిన వారికి రాయితీ కింద అమర్చుతారన్నారు. అలాగే విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వారి సమస్యల పరిష్కార దిశగా చర్యలు చేపట్టడంతో పాటు విద్యుత్ వినియోగదారుల శ్రేయస్సే లక్ష్యంగా సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఏ ఒక్క వినియోగదారుని నుండి సిబ్బందిపై ఫిర్యాదులు రాకూడదని తెలిపారు. బద్వేలు ఏడీ కుళాయప్ప, స్థానిక ఏఈ విజయకుమార్, కొండూరు, కమలకూరు, మాడపూరు సబ్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఉత్సవాల నిర్వహణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో జరగనున్న ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్, మున్సిపల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఎక్సైజ్, అగ్నిమాపకశాఖ అధికారులతో శుక్రవారం మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి నిర్వహించిన ఉత్సవాల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు, సంబంధిత అధికారుల అనుమతులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆయా మండలాల్లో, పట్టణాల్లో ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు, ఏ రోజు నిమజ్జనం చేస్తున్నారనే విషయాలను గుర్తించి ముందుగా సమాచారం ఇవ్వాలని కోరారు. విగ్రహాలను ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రతిష్ఠించేలా చూడాలని పోలీసులకు సూచించారు. అలాగే నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఆయా చెరువుల్లో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎర్రజెండాలు నాటి భక్తులను, నిర్వాహకులను అప్రమత్తం చేయాలని కోరారు. మండపాలకు ఉపయోగించే విద్యుత్తు కోసం విద్యుత్ అధికారుల అనుమతి తీసుకోవడంతో పాటు నాణ్యమైన విద్యుత్ తీగలను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా మండపాల సమీపంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్, మండల పరిషత్ అధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సీఐలు, మున్సిపల్ కమిషనర్, ఎక్సైజ్, అగ్నిమాపకశాఖ అధికారులు, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగ నిర్వహించుకోవాలి

ఈనెల 27న జరగనున్న వినాయకచవితి పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక అర్బన్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంటపాల వద్ద తగిన భద్రత నిర్వాహకులే కల్పించుకోవాలని కోరారు. అలాగే ముఖ్యంగా మహిళలు విలువైన ఆభరణాలు ధరించి వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అర్బన్ ఎస్ఐలు ఎం.సత్యనారాయణ, కె.జయరామిరెడ్డి, పీఎస్ఐ జగదీశ్వర్‌రెడ్డి, పీస్ కమిటీ సభ్యులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రాజుపాళెం : గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక రాజుపాళెం పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం మండలంలోని వినాయక విగ్రహాల ఏర్పాటు చేయబోవు కమిటీ సభ్యులతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేసే వారంతా ఎఞాఠ ఫ్థఖీ అ గ్రాఊఖీ లో వివరాలు పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం రోజున విగ్రహాలను త్వరగా తీసుకెళ్లాలని, మూడు రోజులకే నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. పండుగ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సిద్దయ్య, హెడ్‌కానిస్టేబుల్ రాజారెడ్డి, ప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్‌పై అవగాహన

బి.కోడూరు : మండలంలోని ఐత్రంపేట, గోవిందాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు. బాల్య వివాహం, బాలకార్మికులు, అనాథపిల్లలు, వీధిలో వదిలేసిన పిల్లలను గుర్తించి 1098 నెంబర్‌కు కాల్ చేయవచ్చని తెలిపారు. 1098 టోల్‌ఫ్రీ నెంబర్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నేడు వెల్లాలలో వేలం పాట

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల ఆలయాలకు సంబంధించి భక్తులు అందిస్తున్న వివిధ రకాల వస్తువులను పోగు చేసుకునేందుకు శనివారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనే పాటాదారులంతా రూ.10 వేలు ధరవత్తు చెల్లించాలని తెలిపారు. అలాగే భక్తులు సమర్పించే వస్తువులను ఏడాది పాటు పోగు చేసుకునేందుకు హక్కు కలిగి ఉంటుందన్నారు. అలాగే ఈ ఆలయాలకు సంబంధించి వెల్లాల పొలంలో 11.29 ఎకరాల భూమిని కౌలుకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ చెప్పారు. ఈ పాటలో పాల్గొనే వారంతా రూ.5 వేలు ధరవాత్తు చెల్లించాలన్నారు. హెచ్చు పాటాదారుడు వేలం ముగిసిన వెంటనే కౌలు డబ్బులు చెల్లించి, మూడేళ్ల పాటు పంటలు పండించుకోవచ్చునని చెప్పారు.

తల్లిపై కుమారుడి దాడి

ప్రొద్దుటూరు క్రైం : తనపైనే కేసు పెడతావంటూ తల్లిపై కుమారుడు దాడి చేసిన ఘటన పట్టణంలోని బంగారు అంగళ్ల వీధిలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మాగెన్నగారి వనిత ప్రొద్దుటూరులోని బంగారు అంగళ్ల వీధిలో ఉన్న శంకరయ్యగారి వీధిలో నివాసం ఉంటోంది. శుక్రవారం ఉదయం ఆమె ఇంట్లో ఉన్న సమయంలో కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు కలిసి దాడి చేశారు. తల్లిపై దాడి చేసే జరిగి సమయంలో ఆమె కూతురు లక్ష్మీసౌమిని, మేనమామ వివేకానందరెడ్డిలు అడ్డురాగా వారిపై కూడా దాడికి ప్రయత్నించారు. తన ఇష్టానికి విరుద్ధంగా చెల్లెలు పెళ్లి చేసిందనే కోపంతో గురువారం సాయంత్రం హర్షవర్ధన్‌రెడ్డితో పాటు మరి కొందరు వనిత కారు అద్దాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తనపై కేసు పెట్టిందనే కోపంతో హర్షవర్ధన్‌రెడ్డి తల్లిపై దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లిని కాపాడేందుకై అడ్డు వచ్చిన లక్ష్మీసౌమినికి గాయాలయ్యాయి. వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. 24 గంటల్లోపు రెండు మార్లు హర్షవర్ధన్‌రెడ్డి తల్లిపై దాడికి ప్రయత్నంచాడు. తదుపరి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు హర్షవర్ధన్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేసులో అన్యాయం జరిగింది

తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసే విషయంలో తమకు అన్యాయం జరిగిందని వనిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. హర్షవర్ధన్‌రెడ్డి 24 గంటల వ్యవధిలో రెండు సార్లు దాడికి ప్రయతిస్తే బెయిలబుల్ సెక్షన్‌లు నమోదు చేశారన్నారు. వన్‌టౌన్ పోలీసులు తమ వాదన వినకుండానే కేసు నమోదు చేశారని తెలిపారు. బాధితుల పక్షాన కాకుండా దాడి చేసిన వారివైపే మాట్లాడుతున్నారని చెప్పారు. దీనిపై ఎస్పీని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నివాళి



కేశవ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : రాజంపేట మండలంలోని బాలరాజుపల్లె సమీపంలో చెయ్యేరు నదిలో ఈతకు వెళ్లి మృతిచెందిన పోరుమామిళ్ల పట్టణంలోని శీనప్ప బావికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పినరౌతు చెన్నయ్య కుమారుడు కేశవ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శుక్రవారం వారి స్వగృహానికి వెళ్లి కేశవ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, బద్వేలు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్ రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.